క్లుప్తంగా

ధాన్యం కొనుగోలుకు అనుమతి

సారవకోట: మండలంలో మరో 1000 టన్నుల ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వం అనుమతిచ్చినట్లు వ్యవసాయాధికారి కేసీహెచ్ వెంకటరావు ఆదివారం తెలిపారు. మండలంలో ఈ ఏడాది ఖరీఫ్‌లో లక్ష్యానికి మించి ధాన్యం కొనుగోలు చేశారు. ఇంకా ధాన్యం నిల్వలు ఉండటంతో అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. దీనిపై స్పందించిన ప్రభుత్వం మరో వేయి టన్నుల ధాన్యం కొనుగోలు అనమతులు పంపించింది. నేరుగా రైతుల నుంచి మాత్రమే కొనుగోలు చేస్తామని, మధ్యవర్తుల నుంచి కొనుగోలు చేసేది లేదని వ్యవసాయాధికారి స్పష్టం చేశారు.

22 నుంచి ఉగాది ఉత్సవాలు



నీలమణి దుర్గ అమ్మవారు

హిరమండలం: ఈ నెల 22 నుంచి మండల కేంద్రంలోని పెద్దకోరాడలో గల నీలమణి దుర్గ అమ్మవారి ఆలయంలో ఉగాది ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు దివాకర్ పండా, ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం తెలిపారు. పందిర రాట వేసి ఉత్సవాలు ప్రారంభించడం ఆనవాయితీగా వస్తుందన్నారు. ఉగాది పర్వదినాన అమ్మవారికి ప్రత్యేక పూజలతోపాటు చల్లదనం చేసి మొక్కులు తీర్చుకుంటామన్నారు. పంచాంగ శ్రవణం ఉంటుందన్నారు. అదేరోజు సాయంత్రం అమ్మవారి ఆలయ ఆవరణంలో లక్ష దీపారాధన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. భజన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈ ఉత్సవాలు వారం రోజులు జరుగుతాయన్నారు.

ఉత్కంఠగా జిల్లా స్థాయి షటిల్ పోటీలు



షటిల్ ఆడుతున్న దృశ్యం

నరసన్నపేట: స్థానిక జీసీ హోమ్ షటిల్ కోర్టులో జిల్లా స్థాయి షటిల్ టోర్నమెంట్ పోటాపోటీ జరుగుతుంది. శ్రీమిత్రా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గనగళ్ల జగదీష్ మెమొరియల్ పేరున ఈ టోర్నీ ఫ్లెడ్‌లైట్స్ వెలుతురులో జరుగుతున్న విషయం విదితమే. 50 జట్లు ఈ టోర్నమెంట్‌లో పాల్గొన్నాయి. ఆదివారం పలు జట్లు పోటాపోటీగా తలపడ్డాయి. సోమవారం ఫైనల్ నిర్వహిస్తారు.

వ్యక్తిత్వ వికాసంపై శిక్షణ



బాలలకు సూచనలిస్తున్న ఝాన్సీరాణి

ఆమదాలవలస రూరల్: బాలల్లో వ్యక్తిత్వ వికాసం, విలువలు పెంపొందించేందుకు సత్యసాయి బాలవికాస్ ఆధ్వర్యంలో ఇస్తున్న శిక్షణ తరగతులు ఎంతగానో ఉపయోగపడతావని సర్పంచ్ ఎన్ని రామచంద్రరావు అన్నారు. మండలంలో కట్యాచార్యులపేట గ్రామంలో సత్యసాయి బాలవికాస్ శిక్షణ తరగతులను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లల్లో ఉన్న నైపుణ్యాన్ని వెలికితీసి ఆత్మవిశ్వాసం పెంచడానికి శిక్షణలను ఏర్పాటు చేస్తున్నాట్లు పేర్కొన్నారు. సత్యసాయి సేవా సమితి గ్రామాల్లో చేస్తున్న సేవలను అభినందించారు. పిల్లల్లో ఉన్న సృజనాత్మకతను పెంపొందించడానికి ఇటువంటి శిక్షణలు దోహదపడతావని బాలవికాస్ గురువు తమ్మినేని ఝాన్సీరాణి తెలిపారు.

ఆధార్ అప్‌డేట్ చేసుకోవాలి

నరసన్నపేట: మండలంలో ప్రతిఒక్కరూ ఆధార్ అప్‌డేట్ చేసుకోవాలని ఎంపీడీఓ బి.మధుసూదనరావు ఆదివారం తెలిపారు. ప్రస్తుతం మండలంలో ఐదు శాశ్వత ఆధార్ కేంద్రాలు ఉన్నాయని, వీటిని వినియోగించుకోవాలని కోరారు. అలాగే 20వ తేదీ నుంచి రూరల్ గ్రామాల్లో ప్రత్యేక ఆధార్ క్యాంపులు నిర్వహిస్తామని తెలిపారు. 20, 21వ తేదీల్లో గోపాలపెంట, తామరాపల్లి, కోమర్తి, లుకలాం, నరసన్నపేట-3లో ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అలాగే 27 నుంచి 29వ తేదీ వరకు మాకివలస, జమ్ము, ఉర్లాం, కామేశ్వరిపేట, బొరిగివలసల్లో ఆధార్ ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తున్నామన్నారు. వీటిని వినియోగించుకుని ప్రతి ఒక్కరూ ఆధార్ అప్‌డేట్ చేసుకోవాలన్నారు.

అకాల వర్షం

- పలుచోట్ల నేలకొరిగిన మొక్కజొన్న పంట
- రహదారులపై నిలిచిన వర్షంనీరు



పోలాకి: బెలమర జంక్షన్లో నిలిచిన వర్షం నీరు



ఎల్.ఎన్.పేట: మొదుగువలస వద్ద నేలకొరిగిన మొక్కజొన్న పంట



హిరమండలం: ఏబీ రోడ్డుపై ప్రవహిస్తున్న వర్షంనీరు



సారవకోట: జగ్గయ్యపేట సమీపంలో ధాన్యం కుప్పలపై టార్పాలిన్‌లు కప్పి ఉంచిన రైతులు

సారవకోట: మండల వ్యాప్తంగా శని, ఆదివారాల్లో కురిసిన వర్షాలతో రబీ వరి సాగు చేస్తున్న రైతులకు ఊరటనిచ్చింది. రంగసాగరం ఆయకట్టు కింద బురుజువాడ, జగ్గయ్యపేట, సారవకోట, కొత్తూరు, అగదల, గోపాలపురం గ్రామాల్లోని రైతులు ఈ ఏడాది రబీ వరి సాగు చేస్తున్నారు. రంగసాగరంలో నీరు పూర్తిగా అడుగంటి పోవడంతో చుట్టు పక్కల చెరువులలో నీటిని పొలాలకు పెట్టారు. అయినప్పటికీ ఫలితం లేక ఆందోళన చెందుతున్న సమయంలో వర్షం పడటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రబీలో వరి నూర్పిడి చేసిన రైతులు ధాన్యం తడిచి పోకుండా టార్పాలిన్‌లు కప్పి ఉంచారు.

వర్షంనీటితో ఇబ్బంది..

పోలాకి: మండలంలో శని, ఆదివారాల్లో కురిసిన వర్షానికి డీపీఎన్ (డోల-పోలాకి-నౌపడ) రోడ్డులో బెలమర జంక్షన్ వద్ద నీరు నిల్వ ఉండటంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. వర్షపునీరు బయటకు వెళ్లే మార్గం.. రోడ్డు కంటే ఎత్తుకావటంతో నీరు నిల్వ ఉండిపోతుందని, దీనిపై తగిన చర్యలు తీసుకోవాలని స్థానిక సర్పంచ్ చింతు ప్రమీల ఆర్‌అండ్‌బీ అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై కోటబొమ్మాళి ఆర్‌అండ్‌బీ ఏఈ సరోజ మాట్లాడుతూ జంక్షన్ నుంచి వంశధార కాలువ వరకు డ్రైనేజీ ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. సంబంధిత ప్రతిపాదనలు చేశామని, అనుమతులు వచ్చిన వెంటనే పనులు చేపడతామని తెలిపారు.

వాణిజ్య పంటలకు మేలు..

కొత్తూరు: మండలంలో శని, ఆదివారాల్లో కురిసన వర్షాలకు మామిడి, జీడిమామిడి, నువ్వు, మొక్కజొన్న, చెరకు పంటలతో పాటు పలు రకాల పంటలకు ఎంతో ఉపయోగంగా ఉంటుందని రైతులు తెలిపారు. ఈ వర్షం నువ్వు పంటకు అనుకూలంగా ఉంటుందన్నారు. అరటి, బొప్పాయి, కూరగాయలు, చెరకుతోపాటు పలు రకాల వాణిజ్య పంటలకు ఈ వర్షం ఎంతో ఉపయోగంగా ఉంటుందన్నారు. వర్షం కురవడంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది.

మొక్క జొన్నకు నష్టం

ఎల్.ఎన్.పేట: మండలంలో గత రెండు రోజులుగా కురుస్తున్న అకాల వర్షంతో మొక్కజొన్న పంటకు నష్టం జరిగిందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరి కొద్దీ రోజుల్లో చేతికంది వచ్చే సమయంలో వర్షాలకు పాడైయిందన్నారు. మండలంలోని బసవరాజుపేట, స్కాట్‌పేట, మోదుగువలస, లక్ష్మీనర్సుపేట, మిరియాపల్లి, దబ్బపాడుతోపాటు పలు గ్రామాల్లో అధిక విస్తీర్ణంలో సాగుచేస్తున్న మొక్కజొన్న పంటకు శనివారం రాత్రి నుంచి ఆదివారం తెల్లవారి వరకు కురిసిన వర్షాలకు నేలకొరిగిపోవడంతోపాటు తడిచి పోవడంతో పంట నష్టపోయామని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కలవర పడుతున్న రైతన్నలు

బూర్జ: అకాల వర్షాలతో రైతన్నలు కలవర పడుతున్నారు. గత మూడు రోజులుగా పడిన వర్షాలు, ఈదురుగాలులతో రబీ వ్యవసాయ పంటలు, ఖరీఫ్‌లో పండించిన ధాన్యం బస్తాలు పొలంలో ఉండడంతో ఆందోళన చెందుతున్నారు.

హిరమండలంలో భారీ వర్షం

హిరమండలం: బంగాళఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో హిరమండలంలో శనివారం సాయంత్రం నుంచి ఆదివారం మధ్యాహ్నం వరకు భారీ వర్షం కురిసింది. 34 మిల్లీ మీటర్ల వర్షం కురవడంతో పల్లపు భూములు చెరువులను తలపించాయి. అలికాం-బత్తిలి(ఏబీ) ప్రధాన రహదారిపై వర్షంనీరు ప్రవహించింది. వాహనదారులు ఇబ్బంది పడ్డారు.

ఇటుక పరిశ్రమకు నష్టం..



దేవాది వద్ద తడిచిన ఇటుకలు

నరసన్నపేట: మండలంలో శని, ఆదివారాల్లో కురిసిన వర్షానికి ఇటుక పరిశ్రమకు నష్టం వాటిల్లింది. పచ్చి ఇటుకలు వర్షానికి తడిచి ముద్దయ్యాయి. కాల్చడానికి సిద్ధం చేసిన ఇటుకలను టార్పాలిన్లు వేసి ఉంచినా వర్షం తీవ్రత అధికంగా ఉండటంతో ప్రయోజనం లేకపోయింది. గుండవల్లిపేట, కోమర్తి, దేవాది తదితర గ్రామాల్లో ఇటుక పరిశ్రమదారులకు నష్టం వాటిల్లింది. మార్చి నెలలో ఈ విధంగా అకాల వర్షాలు రావడం గతంలో ఎప్పుడూ జరగ లేదని, వాతావరణ నిపుణులు ముందుగా హెచ్చరించినా ఇంత అధికంగా వర్షం కురుస్తుందనుకోలేదని ఇటుక పరిశ్రమదారులు పంచిరెడ్డి మురళి, రమణ అన్నారు. రైతులు మాత్రం ఈ వర్షంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వేసవి దుక్కులకు, రబీ పంటలకు ఈ వర్షం అనుకూలమని అంటున్నారు.

విద్యుత్ పునరుద్ధరణ



కట్యాచార్యులపేట విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

ఆమదాలవలస రూరల్: మండలంలో శని, ఆదివారాల్లో కురిసిన వర్షాలు కారణంగా పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. మండలంలో దిబ్బలపేట, చీమలవలస, కట్యాచార్యులపేట, బెలమాం, దూసి, చేపానపేట, నిమ్మతొర్లాడ, జీకేవలస, ఇసుకలపేట గ్రామాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ల వద్ద అంతరాయం కలగడంతోపాటు విద్యుత్ తీగలపై చెట్లు కూలిపోయాయి. ఎలక్ట్రికల్ రూరల్ ఏఈ బి.రవికుమార్ ఆధ్వర్యంలో మరమ్మతులు చేపట్టారు. విద్యుత్ అంతరాయం ఉన్న గ్రామాల్లో ఎనర్జీ అసిస్టెంట్లు తక్షణ చర్యలు చేపట్టి విద్యుత్‌ను పునరుద్ధరించారు.

వైఎస్సార్ ఇంటిగ్రేటెడ్ ల్యాబ్‌తో మేలు

- పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి



అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

ఎల్.ఎన్.పేట: వైఎస్సార్ ఇంటిగ్రేటెడ్ ల్యాబ్‌తో రైతులకు ఎంతో మేలు జరుగుతుందని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. ఆదివారం జరిగిన అసెంబ్లీ బడ్జెట్ సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. ఆంధ్రా-ఒడిశా సరిహద్దులో ఉన్న పాతపట్నం నియోజకవర్గం వెనుకబడి ఉందన్నారు. ఈ విషయాన్ని గుర్తించిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి తమ నియోజకవర్గంలోని కొత్తూరు మండలంలో వైఎస్సార్ ఇంటిగ్రేటెడ్ ల్యాబ్ ఏర్పాటు చేశారని గుర్తుచేశారు. ఈ ల్యాబ్‌తో రైతులు వినియోగించే ఎరువులు, పురుగు మందులు, విత్తనాల నాణ్యత పరీక్షలను నిర్వహించి నకిలీల బాధను తప్పించారన్నారు. భూసార పరీక్షలను కూడా ఇక్కడే నిర్వహించటం జరుగుతుందన్నారు. ప్రతీ వారం రైతులతో వ్యవసాయ శాఖ అధికారులు, అనుభవం కలిగిన శాస్త్రవేత్తలు పంట దిగుబడులపై సూచనలు, సలహాలు ఇస్తున్నారన్నారు. రైతుల కోసం అనేక పథకాలను అమలు చేస్తున్నారని గుర్తుచేశారు. గిరిజన రైతులు పండించే పైనాపిల్, సీతాఫలం, పనస, చీపుర్లు, పసుపు వంటి అనేక పంటలకు విలువను పెంచి, పంటలకు మరింత ఎక్కువ ధర లభించేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. గిరిజన రైతులకు కూడా ఈ ల్యాబ్‌లకు అనుసంధానం చేయాలన్నారు. గత ప్రభుత్వం రైతులకు తీరని అన్యాయం చేసిందని ఆరోపించారు. రైతుల సంక్షేమాన్ని గత ప్రభుత్వం ఎప్పుడూ పట్టించుకోలేదన్నారు.

ఆశాజనకంగా నువ్వు పంట సాగు



ధనుకువాడ ప్రాంతంలో ఆశాజనకంగా ఉన్న నువ్వు పంట

ఎల్.ఎన్.పేట: నూనె గింజల్లోనూ, వాణిజ్య పంటల్లోనూ ప్రధానంగా చెప్పుకునే నువ్వు పంట సాగు ఈ ఏడాది ఆశాజనకంగా ఉంది. ఆరుతడి పంటగా వేసుకున్న నువ్వు పంటకు ఈ ఏడాది వర్షాలు అనుకూలించడంతో ఏపుగా పెరిగిందని, అధిక దిగుబడులు వస్తాయని పలు గ్రామాలకు చెందిన రైతులు చెబుతున్నారు. మండలంలో గత ఏడాది సుమారు 250 ఎకరాల్లోనే నువ్వు సాగు చేయగా.. ఈ ఏడాది సుమారు 400 ఎకరాల వరకు సాగు చేస్తున్నారని వ్యవసాయ శాఖ సిబ్బంది చెబుతున్నారు. దుక్కి చేసి విత్తనాలు వేసుకున్న తరువాత ఎలాంటి పెట్టుబడి లేకుండా నువ్వు పంట చేతికి అందుతుంది. నువ్వు విత్తనాలు వేసిన కొన్ని రోజులు తరువాత తేలిక పాటి వర్షం పడితే నువ్వు పంట ఆశాజనకంగా ఉంటుందని, ఈ ఏడాది ఇటీవలి మూడు విడతల్లో కురిసిన వర్షాలు నువ్వు పంటుకు ఊపిరి పోశాయని దబ్బపాడు, మిరియాపల్లి గ్రామాలకు చెందిన రైతులు పల్లి అప్పలనాయుడు, ఎస్.వైకుంఠరావులతో పాటు పలువురు తెలిపారు. మండలంలోని సిద్ధాంతం, బరటాం, సుమంతాపురం, కృష్ణాపురం, కరకవలస, బొర్రంపేట, ముంగెన్నపాడు, దబ్బపాడు, వాడవలస, లక్ష్మీనర్సుపేట, బసవరాజుపేట, మిరియాపల్లి, ధనుకువాడ, రావిచెంద్రి, బొత్తాడసింగి, యంబరాం, జాడుపేట, కొమ్మువలస, స్కాట్‌పేట, మోదుగువలస తదితర గ్రామాల్లో నువ్వు పంట సాగు చేస్తున్నారు.

ఉగాదికి కొత్త బెల్లం సిద్ధం



నిమ్మతొర్లాడలో తయారు చేసిన బెల్లం

ఆమదాలవలస రూరల్: బెల్లం తయారీకి పేరుపొందిన నాగావళి పరివాహక ప్రాంతాలైన కొరపాం, చేపానపేట, బుడితిపేట, నిమ్మతొర్లాడ, జీకేవలస గ్రామాల్లో రైతులు బిజీగా ఉంటున్నారు. ఉగాదికి ఈ గ్రామాల్లో విరివిరిగా కొత్త బెల్లాన్ని కొనుగోలు చేస్తుంటారు. కొత్త బెల్లం తయారీ కోసం చెరకు రైతులంతా తయారీపై దృష్టి సారించారు. ఇక్కడి బెల్లానికి రాష్ట్రం నలుమూలలా పేరు పొందడం వల్ల రైతులే నేరుగా గానుగలు ఏర్పాటు చేసుకుని బెల్లాన్ని తయారు చేస్తున్నారు. బెల్లం తయారీలో ఎటువంటి రసాయనాలు కలపకుండా స్వచ్ఛమైన బెల్లం అందించడంతో నాగావళి నదీతీర గ్రామాలు పేరుపొందాయి. రైతులు సొంతంగా తయారు చేసిన బెల్లాన్ని మార్కెట్‌కు తరలించుకుని విక్రయాలు జరుపుతున్నారు. ప్రతి ఇంట్లో ఉగాది పచ్చడిని తయారు చేసేందుకు కొత్త బెల్లం వినియోగిస్తారు.

ఆస్తి పన్నుపై వడ్డీ మాఫీ

ఆమదాలవలస: ఈ నెల 31వ తేదీలోగా ఆస్తి పన్ను చెల్లిస్తే వడ్డీ మినహాయింపు (మాఫీ) వర్తిస్తుందని మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ అప్పలనాయుడు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరంలో విధించిన పన్ను మొత్తాన్ని ఒకేసారి చెల్లించి ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని పన్ను చెల్లింపుదారులను కోరారు.

21న అప్పలసూరి వర్ధంతి

నరసన్నపేట: విప్లవ సాయుధ రైతాంగ పోరాట యోధుడు మామిడి అప్పలసూరి, గుమ్మడి లచ్చయ్యల వర్ధంతి సభ మంగళవారం కోమర్తి అమర వీరుల స్థూపం వద్ద నిర్వహించనున్నారు. ఈ మేరకు సీపీఐ (ఎంఎల్)న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి తాండ్ర ప్రకాశ్ ఆదివారం ఒక ప్రకటలో తెలిపారు. పార్టీ అభిమానులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

బాల్ బ్యాడ్మింటన్ పోరులో సిక్కోలు అదుర్స్



బాడ్మింటన్ సంఘ ప్రతినిధులు, మేనేజర్లతో జిల్లా జూనియర్స్ బాలికల జట్టు సభ్యులు

శ్రీకాకుళం న్యూకాలనీ: సిక్కోలు బాలికల బాల్ బ్యాడ్మింటన్ జట్టు చరిత్ర సృష్టించింది. జిల్లా చరిత్రలో జూనియర్స్ విభాగంలో బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో తొలిసారి పతకం సాధించింది నెల్లూరు జిల్లా కావలిలోని డీబీఎస్ ఇంజినీరింగ్ కళాశాల క్రీడా ప్రాంగణం వేదికగా ఈ నెల 17 నుంచి 19వ తేదీ వరకు 7వ ఏపీ రాష్ట్ర స్థాయి జూనియర్స్ బాల్ బాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీలు జరిగాయి. ఇందులో శ్రీకాకుళం జిల్లా బాలికల జట్టు ఉత్తమ ప్రదర్శనను కనబర్చి తృతీయస్థానంలో నిలవడంతో సభ్యులంతా కాంస్య పతకాలు సాధించారు. ఈ మెగా టోర్నీలో నెల్లూరు, విజయనగరం, కడప, చిత్తూరు, పశ్చిమగోదావరి, గుంటూరు జిల్లాలను మట్టికరిపించిన జిల్లా బాలికల జట్టు సెమీఫైనల్స్‌లో మాత్రం ఒక్కపాయింట్ తేడాతో ఓడి ఫైనల్‌బెర్త్‌ను కోల్పోయింది. సెమీస్‌లో విశాఖపట్నం జట్టుతో తలపడిన శ్రీకాకుళం జట్టు హోరాహోరి పోరులో తుది వరకు పోరాడి ఒక్క పాయింట్ తేడాతో ఓటమి పాలైంది. దీంతో తృతీయస్థానం కోసం గుంటూరు జిల్లాతో జరిగిన మ్యాచ్‌లో ఘన విజయం సాధించి కాంస్య పతకాలను సొంతం చేసుకున్నారు. జిల్లా జట్టు కోచ్ మేనేజర్లగా ఎం.మధుసూదనరావు, కె.మోహనరావు వ్యవహరించారు. విజేతలకు ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, కార్యదర్శి ఎం.సాంబమూర్తి, జిల్లా పీఈటీ సంఘ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.వి. రమణ, జిల్లా డీఎస్‌ఏ సీఈఓ బి.వి.ప్రసాదరావు, చీఫ్ కోచ్ ఎం.మాధురీలత, ఎన్‌వైకే యూత్ కోఆర్డినేటర్ కె.వెంకట్ ఉజ్వల్, బ్యాడ్మింటన్ సంఘం ప్రతినిధులు బీహెచ్ అరుణకుమార్, పి.అజయ్‌కుమార్, సీనియర్ క్రీడాకారులు అభినందించారు.

ఆదిత్యునికి విశేష పూజలు

అరసవల్లి: సూర్యనారాయణ స్వామికి ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి వర్షం కురుస్తున్నప్పటికీ ఇతర ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులతో ఆలయ పరిసరాల్లో సందడి కనిపించింది. భక్తులు తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకోగా, ఆరోగ్యం కోసం మరికొందరు సూర్యనమస్కార పూజలు చేయించుకున్నారు. స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. వర్షంలో భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఈవో వి.హరిసూర్యప్రకాష్ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

పాటల పోటీల్లో ప్రతిభ



సోనాళికకు ట్రోఫిని అందజేస్తున్న పలాస సినిమా హీరో రక్షిత్

నరసన్నపేట: తెలంగాణ రాజధాని హైదరాబాద్‌లో నిర్వహించిన పాటల పోటీలో నరసన్నపేట పోస్టాఫీస్ రోడ్డుకు చెందిన బుద్ధల సోనాళిక ప్రథమ బహుమతి పొందింది. తెలుగు రాష్ట్రాల స్థాయిలో మూడు దశల్లో నిర్వహించిన పాటల పోటీల ఫైనల్స్ శనివారం నిర్వహించారు. ఈ పోటీలను వాయిస్ ఆఫ్ హైదారాబాద్ పేరున చైతన్య స్పందన సంస్థ, సీబీఐటీ కళాశాల యాజమాన్యం సంయుక్తంగా నిర్వహించారు. ఫైనల్స్‌లో జీన్స్ సినిమాలో 'కన్నులతో చూసేది' అనే పాట పాడి ఆకట్టుకుంది. ట్రోఫీని పలాస సినిమా హీరో రక్షిత్ అట్లూరి అందించారు. ఈ సందర్భంగా సోనాళిక తల్లి రజిని మాట్లాడుతూ మొదటి రౌండ్ ఆన్‌లైన్‌లో నిర్వహించారని, సెకెండ్ రౌండ్ హైదరాబాద్‌లో నిర్వహించగా.. ఫైనల్ రౌండ్‌కు 24 మందిలో సోనాళిక ఎంపిక అయి విజేతగా నిలిచిందన్నారు.

పోలీస్ స్టేషన్‌కు చేరిన 'పది' ప్రశ్నపత్రాలు



ప్రశ్నపత్రాలను భద్రపర్చుతున్న పరీక్షల సిబ్బంది

సారవకోట: ఏప్రిల్ మూడో తేదీ నుంచి జరగనున్న 10వ తరగతి పరీక్షల కోసం ప్రశ్నపత్రాలు ఆదివారం సారవకోట పోలీస్ స్టేషన్‌కు చేరాయి. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రంలో ఈ ఏడాది పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ పరీక్షల నిమిత్తం ఒకటో సెట్ ప్రశ్నపత్రాలు పోలీస్ స్టేషన్‌కు చేరాయి. ఎంఈఓ ఎం.వి.రమణ, పరీక్ష కేంద్రం చీఫ్ సూపరిటెండెంట్ పూర్ణచంద్రుడు ప్రశ్నపత్రాలను భద్రపర్చారు. ఈ పరీక్ష కేంద్రంలో సారవకోట, అలుదు, చిన్నకిట్టాలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, కేజీబీవీ, సవరబొంతు ఆశ్రమ పాఠశాలలు, సారవకోటలోని నవతేజ పాఠశాలకు చెందిన 320 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. అలాగే బుడితి పరీక్ష కేంద్రంలో 210 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు ఎంఈఓ తెలిపారు.

పొందూరు: ఏప్రిల్ 3 నుంచి 18వ తేదీ వరకు జరగనున్న పదో తరగతి ప్రశ్నపత్రాలు పొందూరు స్టేషన్ హౌస్ కార్యాలయానికి చేరుకున్నాయి. వీటిని పోలీస్ స్టేషన్‌లో భద్రతపర్చారు. పొందూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఏపీ మోడల్ స్కూల్, తాడివలస ప్రభుత్వ ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రాలకు చెందిన పేపర్లు వచ్చాయని ఎంఈఓ పీవీ రామరాజు, కస్టోడియన్, జాయింట్ కస్టోడియన్లు అరుణకుమారి, హరిప్రసన్న తెలిపారు. చీఫ్ సూపరింటెండెంట్‌లు పాల్గొన్నారు.

రక్తదానం.. ప్రాణదానం




రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్, తదితరులు

నరసన్నపేట: రక్తదానానికి దాతలు ముందుకు రావాలని నరసన్నపేట సర్పంచ్ బూరల్లి శంకర్ అన్నారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో గనగళ్ల వెంకట జగదీష్ తృతీయ వర్ధంతి సందర్భంగా ఆయన మిత్రులు ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. దీనిని ప్రారంభించిన శంకరరావు మాట్లాడుతూ రక్తదానం చేయడం ద్వారా ఇతరుల ప్రాణాలు కాపాడిన వారవుతారన్నారు. ప్రతి ఒక్కరూ రక్తదానానికి ఆసక్తి చూపాలన్నారు. శిబిరంలో 34 యూనిట్లు రక్తం సేకరించామని జెమ్స్ ఆస్పత్రి పీఆర్‌ఓ శంకరరావు తెలిపారు. ఉప సర్పంచ్ ఎస్.కృష్ణబాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు గుప్త, కేశవరావు, ఆర్.శ్రీధర్, డేవిడ్, గనగళ్ల శ్రీను, రాము, పంచాయతీ ఈఓ సింహాద్రి పాల్గొన్నారు.

ప్రయాణికుల అవస్థలు..



నిరుపయోగంగా ఉన్న నీటి ట్యాంకు



మరుగుదొడ్డి దుస్థితి ఇలా..

పాతపట్నం: ప్రయాణికులకు నిలయంగా ఉండాల్సిన పాతపట్నం ఆర్టీసీ కాంప్లెక్స్ అనేక సమస్యలకు నిలయంగా ఉంది. ప్రయాణికులు, కండక్టర్లు, డ్రైవర్లు అనేక ఇబ్బంది పడుతున్నారు. వేసవి తీవ్రత ప్రారంభం కావడంతో కాంప్లెక్స్ ప్రాంగణంలో తాగునీటి సదుపాయం కల్పించాలని కోరుతున్నారు. వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణానికి ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పే అధికారులు.. ఈ కాంప్లెక్స్‌లో మరుగుదొడ్లు ఇలా ఉంటే ఎలా అని పలువురు ప్రశ్నిస్తున్నారు. పాతపట్నం కాంప్లెక్స్ రాష్ట్ర సరిహద్దులో ఉండడంతో ఒడిశా, ఆంధ్ర ప్రయాణికులు ఇక్కడి వస్తుంటారు. కనీస సౌకర్యాలు లేకపోవడంతో మరిన్ని ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా జిల్లా ఆర్టీసీ అధికారులు స్పందించి సౌకర్యాలు కల్పించాలని కోరుతున్నారు.